# వర్ధిలు కోరికా వర్ధిల్లు!

## 2-8-1985 స్వాతి వార పత్రిక

సరిగ్గా ఆ మేడముందుకిరాగానే, ఒకటీ అరా చినుకులు పడటం అప్పుడేమొదలైంది. పొద్దున్నించీ ఎండ కాసినమీదట ఇప్పుడీ జల్లుపడటం.. ఎదురుచూడని ప్రియురాలు ఎదురై ఎదమీద వాలినట్టనిపించేలా ఉంది ఆనంద్ దృష్టిలో... ఎప్పుడైనా కవితలురాసే అలవాటుంది ఆనంద్‌కి. ఎటొచ్చీ అవి అతని నోట్‌బుక్ వరకే పరిమితం మరీమనసు బాగు లేనప్పుడు ఒంటరిగా కూచుని చదువుకుంటూ ఉంటాడు.

గేటుముందు ఒక్కక్షణం నిలబడిచూశాడు, చుట్టూ ఎత్తయినగోడ, పెద్దగేటు మధ్యలో... లోపలగాఉంది. లేతనీలిరంగుమేడ... ప్రియుడి బాహుబంధాల్లో ఒదిగిన ప్రియురాలి మల్లే కనిపించిందా మేడ ఆనంద్ కళ్ళకి... అతని కవితా దృష్టికి...

గేటు తీశాడు... బరువుగా మూలిగింది గేటు

లోపలికి నడిచాడు..ఇటూ అటూ రెండు వైపులా అందంగా వరుసలో నాటినమొక్కల రంగురంగుల పూవులు, గాలికి ఊగుతూ "రా రమ్మని" పిలుస్తున్న ప్రియురాలి నవ్వుల్లా ఉన్నాయి.

వరండాలో కునికిపాట్లు పడుతున్న నౌకరు లేచి ముందుకి వొచ్చాడు.

ఒక్కక్షణం ఎగాదిగా చూశాడా నౌకరు. ఆనంద్ చేతిలోఉన్న బ్యాగ్‌మీద దృష్టి నిలిపి అన్నాడు "తమదీ ఊరుకాదనుకుంటాను బాబూ! అందికే తమకి తెలియలేదేమో? పెద్దయ్యగారు లేరుబాబూ! పోయారు" ఉలిక్కి పడ్డాడు ఆనంద్ "అయ్యో! ఇప్పుడెలా? ఈ ఒక్క ఆశకూడా లేకుండా పోయిందే? ఆయన పోయినట్టు తెలియక" నా చిన్న నాటి స్నేహితుడున్నాడు ఆ ఊళ్ళో.... బాగాపలుకుబడిఉన్న

వాడు. ఆయన్ని కల్సుకుని, నువ్వుఫలానా అనిచెప్పి ఈ ఉద్యోగ విషయంలో సాయం చెయ్యమని అడుగు. తప్ప కుండా, తన పలుకుబడి ఉపయోగించి నీకీ ఉద్యోగం వేయించగలడు, నాకానమ్మకం ఉంది" అంటూ ఇంటి అడ్రసు గుర్తులుచెప్పి పంపించాడు తన తండ్రి.. అన్నీ ఉన్నాయి అల్లుడునోట్లో శని అన్నట్టు ఇప్పుడింకేం లాభం?.. ఎంత ఆశపెట్టుకున్నాడీ ఉద్యోగమ్మీద తను... మంచంమీదున్నాడు రిటైరయినతన తండ్రి... వైద్యానికి డబ్బులేదు. తను కూడా మంచం ఎక్కితే, ఇంటి పనుల్లో ఆసరా ఉండకపోవడమే కాక పిల్లలకి మరింత దిగులూ, భయం పెంచడమే అవుతుందని... మొండిగా అనారోగ్యంతో లేచితిరిగే తల్లి, ఒక్క అక్క, ముగ్గురు చెల్లెళ్ళు ఇదీ తన కుటుంబం... తను ఎమ్.ఏ. చదివాడంటే అదంతా మేనమామ చలవే... ఆ మేనమామ ఆస్తిపరుడేంకాదు... రెక్కాడితేగానీ డొక్కాడని వాడే.. ఎటొచ్చీ వాళ్ళదిచిన్న కుటుంబం ఓ కొడుకూ, ఓ కూతురూ... ఆకూతుర్ని తనకి కట్టబెట్టాలని ఆయన కోరిక.. తనని ఎమ్.ఏ. చదివిస్తాననీ, ఆ తర్వాత వాళ్ళమ్మాయిని పెళ్ళాడాలనీ ఆయన అడిగితే కాదనలేదు తను... ఆయన కూతురుమూగది... ఎలాగోలా ఆపిల్లని ఓ ఇంటిదాన్ని చెయ్యడమే ఆయనక్కా వలసింది మూగపిల్లకాబట్టి దాని క్షేమంకోరి, ఆరునూరైనా సరే చెల్లెలింట్లో దాన్ని పడెయ్యడమే శ్రేయస్కరం అనుకున్నాడాయన. ఎటొచ్చీ, ఉద్యోగం ఏదైనా వొచ్చాకే పెళ్ళిచేసుకుంటానని తను ఖచ్చితంగా చెప్పేశాడు. సరేననక తప్ప లేదా యనకి.

"ఏంటిబాబూ! అట్టాగే సూస్తూండిపోయారు? చిన్నమ్మాయిగోరితో మాటాడతారా? చిన్నయ్య గోరింట్లో లేరు" నౌకరు మాటల్తో ఆలోచనల్లోంచి ఇవతలికి వొచ్చాడు ఆనంద్.

"అమ్మాయిగారా? ఏ అమ్మాయిగారు?"

"పెద్యయ్య గోరికికూతురొక్క రేకదండీ... అమ్మాయిగోరూ, అల్లుడుగోరూ ఈ ఇంట్లోనే కదండీ ఉండేది! పెద్దయ్యగోరు పోయినకాడినించీ పూర్తిగా యాపారయిషయాలన్నీ చిన్నయ్య గోరేకదండీ మరిసూసేది! ఇప్పుడు చిన్నయ్య గోరింటో లేరండి.... అరికెన్నో పన్లుంటాయి కదండీ?...."అంటూనే లోపలికెళ్ళి, ఓ రెండు నిమిషాల్లో మళ్ళీ బైటికొచ్చాడు ఆ నౌకరు.

"రండిబాబూ! లోపలకి రమ్మన్నారు... అలా కూచోండి..." డ్రాయింగ్ రూమ్‌లోకి దోవచూపించి బయటికి వెళ్ళిపోయాడు.

ధనవంతులడాబు, దర్పాలఛాయలు కొలుస్తూ ఆ గదిలో నిలబడే ఉన్నాడు ఆనంద్.

లోపలి గదుల్లోంచి దగ్గరవుతున్న అడుగుల చిరు సవ్వడి.. గాజుల గలగల... సింగారించుకున్న మనిషికంటే ముందే గాలి మోసు కొస్తున్న మల్లెలగుబాళింపు... అందమైననాజూకు హస్తం, సుతారంగా కర్టెన్ పక్కకి తొలిగించింది. ఆ వెనక సుతిమెత్తని పాదం గడప ఇవతల పెట్టింది ఓ పుత్తడిబొమ్మ

కళ్ళుకళ్ళతో కలిసికంగారుపడ్డాడు ఆనంద్ పలకరించబోయి పలుకే రానట్టు అల్లల్లాడాయి పెదవులు.

కళ్ళు కళ్ళతో కలిసి కంగారు పడలేదు పుత్తడి బొమ్మ. ఎవరా వచ్చిందని ముడివడిన భ్రుకుటి విడివడింది మురిసిపోతూ రెక్కలు విప్పుకున్న పక్షిలా, పెదవులు చిరు నవ్వుల జల్లులేకాక, పలుకుల సోనలుకూడా కురిపించాయి.

"హాయ్! ఆనంద్! నువ్వా?... రా.... కూర్చో... ఏవిటలా నిలబడే ఉన్నావ్? కూర్చో...." ఇంచుమించు చెయ్యిపట్టుకుని లాగినంతపనిచేసి సోఫాలోకూలేసింది చిత్తరువే అయిన ఆనంద్‌ని ఆ పుత్తడిబొమ్మ చంద్రామతి...."

"నువ్వు... నువ్వు... ఇక్కడ?...." ఆశ్చర్య పోతున్నాడు ఆనంద్.

"అబ్బ! మరీ అంత ఆశ్చర్యం నటించకు. నేనిక్కడున్నానని తెలియకపోతే నాకోసం ఇక్కడికెలావొచ్చావ్?" తగిలి తగలనట్టు సోఫాలో అతని పక్కనే కూర్చుంది వయ్యారంగా. మిలమిలా మెరిసిపోతున్న మెత్తని సిల్క్ చీర కొంగు అతని చేతిని ముద్దుపెట్టుకుంది.

"వెంకట్రావయ్యగారు...."

అతనిమాటపూర్తికాకుండానే అందుకుంది.

"మానాన్నగారే.... ఇప్పుడు లేరు.. ఔనూ... మానాన్నగారు నీకెలాతెలుసూ?"

"నాకు తెలియదు కనీసం, ఎప్పుడూచూడను కూడా లేదు..."

"ఔన్లే... నేనెప్పుడూ నీకుచెప్పలేదుగా... మానాన్నగారి పేరూ, ఊరూ నీకు తెలియవు మా అమ్మ నాచిన్నప్పుడే పోవడంతో, చిన్నప్పట్నించీ నేనుమా అత్తయ్య వాళ్ళింట్లో వైజాగ్‌లో ఉండి చదువుకునేదాన్ని. నువ్వూ ఆ ఊళ్ళోనే మీమావయ్యా వాళ్ళింట్లో ఉండి ఎమ్. ఏ. వెలగ బెట్టడం వల్లనేకదా మనిద్దరికీ పరిచయమైంది. నేను గొప్పింటిపిల్లననే తప్ప మానాన్నగారెవరో ఏమిటో నీకుతెలియదు కదా!" నవ్వింది చంద్రావతి. తగిలీ తగలనట్టుకూర్చున్న చంద్రావతి మెత్తని, గుండ్రని భుజం ఈసారి బాగానే ఆనంద్ భుజాన్ని తాకింది... కొద్దిగా ప్రక్కకి జరిగాడు ఇబ్బందిగా చూస్తూ.

"మీ నాన్నగారికి మా నాన్నగారు బాల్య స్నేహితులట. మా నాన్నగారు మంచానపడకముందు, ఏవోపన్లమీద ఒకటి రెండుసార్లు ఈ ఊరొచ్చినప్పుడు మీనాన్న గార్ని కల్సుకున్నారుట.. అందుకే ఇప్పుడు మీ అడ్రస్ ఇవ్వగలిగారు"

"ఓ.... మనిద్దరం ఫ్రెండ్సుకాక, మీనాన్న గారూ మానాన్న గారూకూడా ఫ్రెండ్సే అన్న మాట" చంద్రావతి కాలు ఊగుతూ ఆనంద్ కాలిని పలకరించింది... నవ్వలేక నవ్వుతూ కాలు వెనక్కి తీసుకున్నాడతను.

"అరే! మాటల్లోపడి డియరెస్టు ఫ్రెండుకి కనీస మర్యాదలే మర్చిపోయాను.. కాఫీ తాగిస్నానం చేద్దువుగాని.. పైడయ్యా!..." పని కుర్రాడిని కేకేసింది.

"ఏంటమ్మ గారూ?"

"ఇదిగో ఈ బ్యాగ్ ఆ గదిలో పెట్టు. రెండు కాఫీలుకలిపి తీసుకురమ్మను అన్నపూర్ణమ్మని.

"అలాగేనమ్మా!" ఆ కుర్రాడలావెళ్ళగానే ఆనంద్ షర్ట్‌ముట్టుకు చూసి, తెగ కంగారుపడి పోయింది చంద్రావతి. "అరెరే ! ఇంత సేపూ నిన్ను చూసిన సంతోషంలో

నేనిది గమనించ నేలేదు.. వెరీ సారీ ఆనంద్... వర్షంలో తడిసి పోయినట్టుంది షర్టు.... పాపం ! తడిదాంతోనే కూచున్నావు ఇంత సేపూ... ఇప్పేసెయ్యి...."

ఆమె చెయ్యి అతని గుండెలమీద వెచ్చగా, తనే ఎక్కడ బటన్స్ విప్పేస్తుందో నన్నంత భయం వేసింది ఆనంద్‌కి. ఆమె చేతినిమెల్లిగా పక్కకి తప్పించాడు తనగుండెలమీంచి. కాస్త ఊపిరాడింది అప్పుడు. "పర్వాలేదు... గేటు దగ్గర్నించి లోపలికొచ్చేటప్పటికి రెండు చినుకులు పడ్డాయంతే, తడవందే.. అయినా, నేనిక్కడుండి మిమ్మల్ని ఇబ్బంది పెట్టదల్చుకోలేదు... ఏదైనా లాడ్జికి వెళ్తాను" అంటూ అసలు తను ఆ ఊరు వచ్చిన కారణం, కుటుంబ పరిస్థితులూ... అన్నీకూడా కాఫీతాగుతూ వివరించాడు. "నువ్వు లాడ్జిలో వుండడానికి వీల్లేదు. మా ఇంట్లోనే వుండాలి.... నువ్వు వెళ్తానన్నా ఈ స్నేహితురాలు వెళ్ళనివ్వదు... ఇంక రెండో విషయం ఏమిటంటే... మానాన్న గారు లేరుకదా అని... ఆ ఉద్యోగం నీకు రాదని నిరాశ పడనక్కర్లేదు నువ్వు... నీకా ఉద్యోగం గ్యారంటీ. సరేనా?" అర్థంకానట్టు చూశాడు ఆనంద్ "రేపు నిన్ను ఇంటర్వ్యూ చెయ్యబోయేది ఆ కంపెనీ డైరెక్టరయిన మా శ్రీవారే" చంద్రావతికళ్ళల్లో తొంగిచూసిన గర్వం ఇప్పుడు కొత్తగావొచ్చి నదేమీకాదు.

"నిజమా?" నీరుకారిపోయిన ఆశ మళ్ళీదాని రూపం అది దాల్చింది.

"ఏవంటారూ? నేనన్నదానికి ఓ.కే. అంటారు. నీకా ఉద్యోగం ఇచ్చి తీరాలనినేనొక మాట చెప్పానంటే దానికింక తిరుగుండదు. రేప్పొద్దున్న వొస్తారు మావారు. రేపుమధ్యాహ్నంకదా అన్నావు ఇంటర్వ్యూ? ఇవాళ రాత్రి వాళ్ళ గెస్టుహౌస్‌లో ఏదో పార్టీ ఉందట, రాత్రి అక్కడే ఉండిపోతానన్నారు, ఇంటికి రానన్నారు... రేప్పొద్దున్న ఆయనరాగానే నీ గురించి చెప్పి, నీకా ఉద్యోగం వేయించమంటానులే, ఇంకనువ్వే దిగులూ పెట్టుకోకు"

ఆనంద్ కళ్ళల్లో మెదిలిన ఆశ చకచకా ఊహాలపందిరివేసేసి అల్లుకు పోయింది పైపైకి..

కొడుకు ఉద్యోగస్థుడైన సంతోషం... తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని మెరుగు పరిచింది.. తండ్రిలేచి ఇల్లంతా కలియ తిరిగేస్తున్నాడు. తల్లి సునాయాసంగా, చకచకా ఇంటెడుపనులూ చేసేస్తోంది నిమిషాలమీద... మంచి సంబంధం తీసుకొచ్చి అక్క పెళ్ళి ఏ లోటూ లేకండా చేసేశారు.. అక్కకళ్ళల్లో ఎప్పుడూ చూడని కాంతి.. చెల్లెళ్ళకి కూడా వరసగా పెళ్ళిళ్ళయి పోయాయి... కృతజ్ఞతగా తనకళ్ళల్లోకి చూస్తున్నారు వాళ్ళు... వొంగి తన కాళ్ళకి నమస్కరిస్తున్నారు... ఇన్నాళ్ళకినా బావ నన్ను కరుణించాడు.. అన్నభావం కళ్ళతో వ్యక్తంచేసి చిరుసిగ్గులొలక పోసింది మావయ్య కూతురు పార్వతి.

"థ్యాంక్స్ చంద్రావతీ... థాంక్స్... నీ ఋణం తీర్చుకోలేను..." కృతజ్ఞతగా చూశాడు. ఆనంద్.

"ఎందుకు తీర్చుకోలేవు? బాగానే తీర్చుకోగలవు....ఆ... సరే... పద స్నానం చేద్దువు గాని..."

★★ ★★ ★★

భోజనమైంది... కాసేపు కబుర్లూ అయ్యాయి. తనకని కేటాయించిన గదిలో పట్టెమంచ మీ్మద మెత్తని పరుపుమీద మేను వాల్చాడు ఆనంద్. ఇల్లంతానిశ్శబ్దం... వీధిలో అంతకంటేనిశ్శబ్దం మనసు మౌనంగా పంచరంగుల ఊహల్లో మునిగి తేలుతోంది... చంద్రావతి పుణ్యమా అని మంచి ఉద్యోగం దొరగకబోతోంది.... ఆతర్వాత ఒక ఇంటి వాడవుతాడు... మావయ్య కూతురు మూగదన్న మాటేగానీ అందాల బొమ్మ... మంచిపిల్లకూడానూ... ఊహల్లో మావకూతురు పక్కకొచ్చింది... కౌగిట్లోకరిగిపోయింది..."

★★ ★★ ★★

మంచం దిగింది అందాల బొమ్మ. కింద కుప్పలాపడేసిన, కొద్దిగా వెలిసిన పాత టెర్లిన్ చీర అందమైన ఒంటికి చుట్టుబెట్టుకుంది. వెల వెలబోతున్న జాకెట్టు రంగు బయట పడిపోకుండా, చీరకొంగు నిండుగాకప్పుకుంది. నల్లని బారెడు

జడ... రేగిపోయిన జుట్టు సరిగ్గా సవరించుకుంది... బల్లమీద ఉన్న కూజాలోంచి పక్కనే ఉన్న గ్లాసులోకి నీళ్ళువొంచుకుని గడ గడా రెండు గ్లాసులుతాగింది.

"మరి నేవెళ్ళొస్తాను సార్... దయుంచండి....ఆ ఉద్యోగం నాకే ఇప్పిస్తారుగా! మర్చి పోరుగా..."

మంచమ్మీద పడుకునేఉన్న చక్రవర్తి ఆమె చేయిపట్టుకులాగాడు... చటుక్కున తూలిముందుకు పడింది అతనిమీద...

"మర్చిపోను... మర్చిపోను..." మాట ముద్దగా వస్తోంది, కళ్ళు ఎర్రగా రక్తంచిమ్ము తున్నట్టే ఉన్నాయి..

"నీ పేరేమిటన్నావ్?" చూపుడువేలు ఆమె పెదవులమీద అడింది.

"నా పేరు కాంతిమతి..."

"ఏమతో?...నీ అందంమటుకు నాకు మతి పోగొట్టేసింది.. నువ్వీ గదిలో అడుగు పెట్టినప్పుడే పిచ్చివాడినై పోయాన్నేను..."

తనని మళ్ళీ గట్టిగా చేతుల్లో బంధించబోతున్న అతన్నించి తప్పించుకుంటూ లేచి నిలబడింది ఆమె.

"మా కుటుంబ పరిస్థితులు చెప్పానుకదా సార్.... దయ ఉంచి గుర్తుంచుకోండి... ఆ ఉద్యోగం.."

"మర్చిపోను.... మర్చిపోతే, నువ్వు నాకిచ్చిందిమర్చి పోయినట్టేకదా.. ఔనా? అంతేనా? వెళ్ళిరాపాపం!... వెళ్ళు..."

"వొస్తానుసార్...." చేతులు జోడించి వెళ్ళి పోయిందా కుమారి కాంతిమతి, రాబోయే ఉద్యోగమ్మీద ఆశలు పెంచుకుంటూ.

★★ ★★ ★★

చిన్నగా తలుపుతోసిన చప్పుడై, తలతిప్పి చూశాడు ఆనంద్. అటువైపు గడియ వేస్తోంది చంద్రావతి. ఎవరో తనని మంచమ్మీంచి తోసినట్టుగా మంచం దిగాడు.

"చంద్రావతీ!" వింతగాచూశాడు.

"ఉష్..." దగ్గరగా వొచ్చింది.... జడలో మల్లెలు ఏ మాయా, మర్మం ఎరగనట్టునవ్వు తున్నాయి.... అంతా ఉత్తది.. ఈ మాయలూ మర్మాలూవాటికి తెల్సినంతగా మరి వేటికి తెలుసు?

మన్మథ బాణాల్లాంటి నవ్వులు రువ్వుతూ మంచమ్మీద అలవోకగా కూర్చుంది చంద్రావతి. ఆమె ఆలోచనల్లాగే ఆమె కళ్ళూ మత్తుగా ఉన్నాయి... గతం ఒక్కసారిగా కళ్ళముందు నిలిచింది. ఆనంద్‌కి.

★★ ★★ ★★

"ఇదేమిటి? ఈ వేళప్పుడొచ్చావు?"

"కమలతో సినిమాకెళ్తున్నానని అత్తయ్యతో చెప్పి ఇలా వొచ్చేశాను, నీగదికి..." చనువుగా మంచమ్మీద కూర్చుంది చంద్రావతి.

"ఆనంద్! నువ్వంటే నాకెంత ఇష్టమో ఇన్నాళ్ళయినా నీకింకా అర్థంకాలేదా?..."

"మనం... స్నేహితులం.... అంతే..."

"కావచ్చు...." వెనక్కి వాలింది కూర్చున్నది కాస్తా.

"సారీ.... చంద్రావతీ! మన స్నేహాన్ని నువ్విలా అర్థం చేసుకుంటావని నేనెప్పుడూ అనుకోలేదు... నువ్వు తప్పుగా అర్థంచేసుకునేలా నీతో నేనెప్పుడూ ప్రవర్తించలేదు కూడా హద్దుమీరి ప్రవర్తించలేదు... హద్దు మీరిమాట్లాడ లేదు... నాకు, మా మావయ్య కూతురితో పెళ్ళి ఏనాడో నిశ్చయమైంది"

పగలబడి నవ్వింది చంద్రావతి. "నువ్వు ఊ అన్నానేను నిన్ను పెళ్ళి చేసుకునేందుకు సిద్ధంగా లేను మిస్టర్!..."

"మరి.. మరి.... ఇదేమిటి... నీ ఉద్దేశ్యం"

“దానికదే దీనికిదే మిస్టర్ ఆనంద్. ఎందుకంత బెదిరిపోతావ్?” ఆమె చెయ్యిపడింది అతని భుజం మీద.

“చంద్రావతీ ! ముందిక్కడినించి బయటికినడు”.

“ఎందుకంత భయపడిపోతావ్ ఆనంద్? పిరికివాళ్ళకి రోజులుకావు. నీ అందానికి తగ్గ జోడినేనే....”

“ఇప్పుడేగా అన్నావు.... నేను ఊ అన్నా కూడా నన్ను పెళ్ళిచేసుకోడం నికిష్టంలేదని?”

“ఔను, అన్నాను ఎందుకన్నాను? నాకున్న అంతస్తు, డబ్బునీకులేవు.. అందుకని, పెళ్ళి అన్నది మనిద్దరి మధ్యాకుదరనివిషయం. నువ్వు అందగాడివి.. అందం నాకూ ఉంది. పెళ్ళికి డబ్బుకీ లంకె వుందిగానీ అందంతో అందం కలవడానికి పెళ్ళి ప్రసక్తిదేనికి ఆనంద్....”

తనమెడని చుట్టేసిన, తెల్లని, ఆ నాజూకు చేతుల్ని విసురుగా వెనక్కి తోశాడు ఆనంద్ “చంద్రావతీ! దయచేసి వెళ్ళిపో ఇక్కడినించి ఇలాంటి ఆలోచనలతో మళ్ళీ ఎప్పుడూనాఎదుటికి రాకు”

అవమాన భారంతో చంద్రావతి ముఖం ఎర్రనయింది.

అతని అందానికి ముగ్ధురాలయి, మనసుండ బట్టక, కోరికతో తనంతట తను వచ్చి చులక నయిపోయినందుకు కోపం, కసి, బాధ, అవమానం అన్నీ కలగలుపుగా ఆమెకళ్ళల్లో చోటు చేసుకున్నాయి.

★★ ★★ ★★

“పాపం! మీ నాన్న గారుమంచంపట్టారన్నావుకదా?”

చంద్రావతి ప్రశ్నతో, గతంలోంచి వర్త మానంలో కొచ్చాడు ఆనంద్. మౌనంగా ముందుకీ వెనక్కి తల అడించాడు.

“రా... ఇలాకూర్చో.... నుంచునేవున్నావు” మంచమ్మీద తనపక్కన చూపించింది.

"అహా.... పర్వాలేదు"

"అబ్బ! మరీ అంతమొహమాటమైతే ఎలా? కూర్చుంటావా... నన్ను కూర్చోపెట్టమన్నావా?" అంటూనే అతని చేయి అందుకుంది. ఆమెచేయి వేడిగా తోచింది ఆనంద్‌కి.

మొహమాట పడుతూనే కూర్చున్నాడు... దగ్గరగా ఆమెడుక్కనే.. మల్లెలవాసన అతన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది... ఆమె.. స్ప్రే చేసుకున్న ఫ్రెంచి పరిమళం అతనిలో రేపుతోంది గిలిగింత... ఉండుండివొస్తున్న యార్డ్లీ ఘుమఘుమలు ; మనులో పలికిస్తున్నాయి సరిగమలు.

"ఏమిటలాముళ్ళ మీద కూర్చున్నట్టుకూర్చున్నావు.... పర్వాలేదు.... ఫ్రీగాకూర్చో...." చేత్తో తట్టింది కాలిమీద.... నాజూకు వేళ్ళునాట్యమే చేశాయి,,, నేచురల్‌పాలిష్‌లో మెరుస్తున్నాయి గోళ్ళు.

"మీ అమ్మగారికీ అనారోగ్య మన్నావు కదూ... అమ్మా, నాన్నగార్లిద్దరికీ మంచి వైద్యం చేయించాలని ఉందికదూ నీకు? మీ అక్కకీ, చెల్లెళ్ళకీ పెళ్ళిళ్ళుచేసి వాళ్ళు నవ్వుతూ కలకలలాడుతూ తిరిగేతే చూడాలని వుంది కదూ నీకు?...వీటన్నిటికీ ఒకదారి కనపడాలంటే ముందు నీకోఉద్యోగం దొరకాలి ఔనా?...."

చెవులూ, కళ్ళే ఆమెకే అప్పగించాడు ఆనంద్. మనసు మావయ్యకూతురు ప్పారతి మీదకి వెళ్ళిపోయింది... నవ్వుతూ, అందంగా కళ్ళతో పలకరించే పార్వతి.... అందాలబొమ్మ పార్వతి... ఎంత సంతోషడి పోతుందోతనకీ ఉద్యోగంవచ్చిందంటే!... మూగదై తేనేం....అమాయకంగా వుండే ఆమె చూపులు... అందంగా మెరిసే ఆ చిరునవ్వులు చాలు తనుమై మరచి పోయేందుకు...

"ఆనంద్ !...."

"ఊ..."

"ఏవిటాలోచిస్తున్నావు?"

"ఊ! అబ్బే... ఏంలేదు... ఏంలేదు...." తన భుజాన్ని మెత్తగా పట్టుకున్న ఆమెచేతిని చూశాడు... ఆ తర్వాత చూశాడు స్థానభ్రంశం చెందిన ఆమెగౌన్‌ని... అక్కడే నిలచిపోయిన చూపుని, నాలుగుచివాట్లువేసి వెనక్కి లాగింది మనసు.

"రేపొద్దున మావారు రాగానే, నీకీ ఉద్యోగ్యం ఇమ్మని నేను చెప్పడంఖాయం... ఆయన ఇవ్వడం ఖాయం... సరేనా? నీకష్టాలు గట్టెక్కాయనుకో...."

ఆనంద్ కళ్ళల్లో మెరిశాయి కోటికాంతులు.

"నేను రికమెండ్ చేసినవాడంటే మావారు చాలా ప్రత్యేకంగా చూస్తారు.. త్వరలో పెద్ద పొజిషన్లోకి నిన్ను తీసుకొచ్చేస్తారు..."

చంద్రావతి చేతులు తన మెడని చుట్టేస్తే తోసెయ్యలేకపోయాయి ఆనంద్ చేతులు... ఉద్యోగం అన్న సంకెల ఆ చేతుల్ని బంధించి వుంచింది.

కానీ, ఎదురుగా కనిపిస్తున్నది చంద్రావతి కాదు.... పార్వతి.... పార్వతే కనిపిస్తోంది.. పార్వతీ.... పార్వతీ.... పదే పదే పరవశంతో పిలుస్తోంది హృదయం అది అతని ఆ పిలుపు చంద్రావతి చెవులపడదు. హృదయపులోతులకే... కలలవాకిళ్ళకే పరిమితం....

అతన్ని అల్లుకున్న ఆమె చేతులు, మరి వదలలేనన్నాయి ఆ పూటకి ఆమెని హత్తుకున్న అతని హృదయం, మూగగా పలవరిస్తోంది పార్వతీ నామధేయం.... పార్వతినే చూశాడు ఆమె శరీరపు ఒంపుల్లో....పార్వతినే స్పృశించాడు పదేపదే తనచేతుల్తో.... మత్తుగా ముద్రలు వేశాడు "పార్వతీ" అనిపరవశిస్తూ...

మానసికంగా, అతని చేతుల్లో నలుగుతున్నది చంద్రావతి కాదు. చంద్రావతిని, ఆ క్షణాల్లో అతను మర్చిపోయాడు పూర్తిగా. తానున్నది చంద్రావతి ఇంట్లోనన్న సంగతి గుర్తులేదు అతనికి ఆకాసేపూ... అదిమావయ్య ఇల్లే... అది పార్వతి బాహు బంధమే... అది అధరామృతమే.....

★★ ★★ ★★

"సార్రీ చంద్రా! నీ ఫ్రెండ్‌కీ ఉద్యోగం ఇవ్వడం కుదరదు... రాత్రే గెస్టుహౌస్‌కి ఫోన్‌చేసి చెప్పారు మినిస్టర్ రంగబాబుగారు. వాళ్ళ బావ మరిది కొడుక్కి ఈ ఉద్యోగం ఇవ్వమని.. అతను నీకూ తెల్సు కదా.... ప్రకాశం అతని పేరు...."

"ఓ ఆ మధ్య... డాక్టర్ గారింట్లో పార్టీలో కలిశాం.. ఆ ప్రకాశమేనా రంగబాబు గారి బావమరిది కొడుకు? సినిమాయక్టర్లెవరూ అతని అందంముందు చాలరు... పాటలుకూడా ఎంత బాగానో పాడతాడు... ఆ రోజు పార్టీలో నా ఒక్కదానితోనే అరగంట సేపు కబుర్లు చెప్పాడని.... డాక్టర్ గారి భార్యకీ, రాజుగారి భార్యకీ కళ్ళు కుట్టాయినన్నుచూసి.. అతనితో కూర్చుంటే టైమ్ తెలియదు... అన్నం, నీళ్ళూ కూడా అక్కర్లేదనిపిస్తుంది...."

"నీతో కూర్చుంటే నాకూ అలాగే అనిపిస్తుంది డియర్.. నువ్వుంటే చాలు ఇంకేమీ అక్కర్లేదనిపిస్తుంది" కొంటెగానవ్వుతూ సున్నితంగా మీద కిలాక్కున్నాడు భార్యని చక్రవర్తి.

గువ్వలా, ముద్దుగా ఆ కౌగిట్లో ఒడిగిపోతూ తియ్యగా గునిసింది చంద్రావతి "మీ ఒక్క కొంటెచూపేచాలు నన్ను నేను మర్చిపోయేందుకు...మీరు నా భర్తకావడం నాఅదృష్టం... జన్మ జన్మలకీ మీరే నాభర్తకావాలి..." ఒక్క క్షణం ఆ పెదవులు మాట్లాడలేక పోయాయి అతను చేసిన కొంటెపనితో. స్త్రీకి పుట్టుకతో వచ్చిన "సిగ్గు" అనేసింగారంతో ఆమెచెంపలు ఎరుపెక్కాయి. ఆమె కళ్ళు బరువెక్కాయి. పుట్టుకతో వచ్చినకొంటెతనపు చేష్టలతో, అతని కళ్ళు నవ్వాయి అల్లరి

"అయితే... ఆ ప్రకాశానికివ్వమని అడిగా రన్నమాట ఆ ఉద్యో... మినిష్టర్ అంతటి వాడడిగితే, కాదనిమీరు మాత్రం ఎలా అంటారు. అతనికే ఇవ్వండి" ప్రకాశందగ్గర తను తీసుకోబోయే తియ్యని విందు గురించి ఆలోచిస్తూ తీయని తలపుల్లో తేలిపోయింది చంద్రావతి.

ఏదో కల్పించి జవాబు చెప్పలేక పోతుందా ఆనంద్‌కి? "పార్కలాం" అన్నమాట, అవసరానికి ఉండనే ఉందిగా ఎవరికైనా.....

★★ ★★ ★★